## క్లుప్తంగా

### రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 15, వంకాయ 35, బెండ 23, పచ్చిమిర్చి 40, కాకర 23, బీర 18, క్యాబేజీ 13, ఫ్రెంచిబీన్స్ 65, క్యారెట్ 33, దొండ 18–23, చిక్కుడు 35–45, గోకర 23, బీట్‌రూట్ 20, క్యాప్సికం 50, ఆలు 21, దోస 11, సొర 11, పొట్ల 13, ఉల్లిగడ్డ 40, చామగడ్డ 38. శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

### 'ఫెడరేషన్ ఆఫ్ సీనియర్ సిటిజెన్స్ ఆర్గనైజేషన్' కార్యవర్గం ఎన్నిక

వనస్థలిపురం: తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ సీనియర్ సిటిజెన్స్ ఆర్గనైజేషన్ కార్యవర్గాన్ని వనస్థలిపురంలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా టి.సుభాకర్‌రావు, కోశాధికారిగా బీఎస్‌వీవీ కృష్ణప్రసాద్, ఉపాధ్యక్షుడిగా ఎ.రాములు, వి.వెంకటనారాయణ, సలహాదారుగా ఎం.సూర్యనారాయణ, సంయుక్త కార్యదర్శులుగా రామారావు, ఎస్.ధనంజయ, కార్యవర్గ సభ్యులుగా ఎం.కృష్ణమూర్తి, బి.జనార్ధన్, జి.ప్రసాదరావు, పి.జయప్రకాశ్‌రావు, వి.నరేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు.

### లక్ష్యాల సాధనకు విద్య దోహదం



పట్టాలు తీసుకున్న విద్యార్థుల సందడి

చంచల్‌గూడ: నేటి పోటీ కాలంలో చదువు ఎంతో ముఖ్యమని ఓయూ ప్రొఫెసర్ డా. రాఘవేంద్ర శర్మ అన్నారు. కుర్మగూడ డివిజన్ దోబీఘాట్‌లోని సక్సెస్ ఇనిస్టిట్యూషన్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు స్థానిక ఫంక్షన్ హాల్లో గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాఘవేంద్ర శర్మ డిగ్రీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఆయన పట్టాలు అందజేశారు. జీవిత లక్ష్యాలను చేరుకోవాలంటే విద్య ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వేడుకల్లో కాలేజీ చైర్మన్ డా. పార్థసారధి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఎస్సీ వర్గీకరణకు బీజేపీ మద్దతు

● అందెల శ్రీరాములు యాదవ్

బడంగ్‌పేట్: ఎస్సీ వర్గీకరణకు బీజేపీ మద్దతిస్తుందని మహేశ్వరం నియోజకర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆలంపూర్ నుంచి హైదరాబాద్‌కు చేపట్టిన పాదయాత్ర గురువారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మల్లాపూర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా కడాది బీరప్ప ఫంక్షన్‌హాల్‌లో బస చేసిన మందకృష్ణను బీజేపీ మహేశ్వరం నియోజకర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు తమ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. ఏండ్ల తరబడి పోరాడుతున్న మందకృష్ణ మాదిగ ఆశయం నేరవేరాలని ఆయన కోరారు. వర్గీకరణతోనే మాదిగలకు తగిన న్యాయం జరుగుతుందని మందకృష్ణమాదిగ అన్నారు. వర్గీకరణకోసం తను ఎంతటి పోరాటం చేయడానికైనా సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. అనంతరం మందకృష్ణను అందెల శాలువా కప్పి సత్కరించి పాదయాత్రకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఎస్సీ మోర్చ నాయకులు గడ్డం వెంకటేశ్, చిత్రం శ్రీను, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



మందకృష్ణకు స్వాగతం పలుకుతున్న అందెల శ్రీరాములు యాదవ్

# అమ్మవారికి ప్రత్యేక పూజలు


వైభవంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు



హయత్‌నగర్ డివిజన్ రాజప్పనగర్‌లో.. పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి



అన్నపూర్ణాదేవి అలంకరణలో విజయదుర్గామాత



సైదాబాద్‌లోని శ్రీగణేశ్ సమాజం మండపంలో..

సైదాబాద్: దేవీ శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా అమ్మవారి ఆలయాలు, మండపాల వద్ద భక్తులతో సందడి నెలకొంది. అమ్మవారిని దర్శించుకొనేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొంటున్నారు. అమ్మవారికి భక్తులు అభిషేకాలు, కుంకుమార్చనలు చేస్తున్నారు. సైదాబాద్ పెద్దతోటలోని వాగామ్రి దుర్గామాత ఆలయంలో కమిటీ చైర్మన్ కాళీ అశోక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సైదాబాద్‌లోని విజయదుర్గామాత ఆలయంలో అమ్మవారు గురువారం అన్నపూర్ణాదేవి అలంకరణలో, జీవన్‌జ్యోతి సంఘంలోని జయదుర్గా మాత మహాచండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మాతామైదాన్‌లో నిర్వహించిన అన్నదానంలో మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ జీవీ రామకృష్ణగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు అర్థం సునీల్‌రెడ్డి, అల్లి శ్రవణ్‌కుమార్, కృష్ణ, రవిశంకర్, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

**షిరిడీ సాయి ఆలయంలో ..**

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని షిరిడీ సాయిబాబా ఆలయంలో 105వ మహాసమాధి ఉత్సవాలు, శ్రీదేవి నవరాత్రి మహోత్సవాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గురువారం అమ్మవారిని మహాచండీ దేవి అలంకారంలో భక్తులు దర్శించుకున్నారు. శ్రీసువర్ణ పుష్పార్చన, చండీ హోమం నిర్వహించారు. భక్తులచే శ్రీసాయి లక్ష నామార్చన నిర్వహించి మహిళలచే బతుకమ్మ నిర్వహించారు. ఆలయ చైర్మన్ గుండ మల్లయ్య దంపతులు, వైస్ చైర్మన్ శ్యామ్‌కుమార్, ఆర్ఎస్ శకర్‌రావు దంపతులు, ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.



వనస్థలిపురం ప్రశాంత్‌నగర్‌లోని కనకదుర్గ ఆలయంలో...



పెద్దతోట వాగామ్రి దుర్గామాత గుడిలో పూజల్లో పాల్గొన్న ఆలయ చైర్మన్ కాళీ అశోక్



మాతామైదాన్‌లో అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే బలాల, సునీల్‌రెడ్డి



గౌరిదేవి అలంకరణలో ప్రత్యంగిరా అమ్మవారు



బీఎన్‌రెడ్డినగర్‌లో..బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ లచ్చిరెడ్డి



సాయిబాబా గుడిలో అర్చనలో పాల్గొన్న భక్తులు

## కనులపండువగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



ఉత్సవమూర్తులకు అభిషేకం చేస్తున్న అర్చకులు

వనస్థలిపురం: వనస్థలిపురం సచివాలయనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 5వ రోజు గురువారం ఉదయం ఉత్సవ మూర్తులకు అభిషేకం, హయగ్రీవ హోమం, అశ్వ వాహనంపై తిరువీధి ఉత్సవం, శ్రీవారి కల్యాణ మహోత్సవం, అన్నప్రసాద వితరణ, సాయంత్రం గరుడ వాహనంపై తిరువీధి ఉత్సవం, డా.ధూళిపాళ మహాదేవమణిచే లలితా ఆవిర్భావం ప్రవచనం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, వైస్ చైర్మన్ జగదీశ్‌కుమార్, కోశాధికారి శ్రీధర్, శ్యామల, రామలక్ష్మి, సాంబశివరావు, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వాహన తనిఖీల్లో రూ. 2.41 లక్షలు స్వాధీనం

హస్తినాపురం: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో వనస్థలిపురం పరిధిలోని పలు ప్రాంతాల్లో పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్నారు. గురువారం సుష్మాచౌరస్తాలో విజయవాడ రహదారిపై వనస్థలిపురం సీఐ జలేంధర్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి వాహనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు వాహనాల్లో తరలిస్తున్న 2 లక్షల 41 వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. మహ్మద్ అబ్దుల్ బషీర్ అనే వ్యక్తి రూ. 1.21 లక్షలు, ఎ. వెంకటేశ్వరరావు అనే వ్యక్తి రూ. 1.20 లక్షలు తరలిస్తున్నారని, వారి వద్ద డబ్బుకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నామని సీఐ వెల్లడించారు. విజయవాడ జాతీయ రహదారితో పాటు నాగార్జునసాగర్ జాతీయ రహదారిపై కూడా ఎక్కడపడితే అక్కడ ఆకస్మికంగా వాహనాలను ఆపి ప్రతి రోజు తనిఖీలు చేస్తున్నామని సీఐ జలేంధర్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐలు జగన్, మాధవరెడ్డి , నర్సింగ్‌రాథోడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సుష్మాచౌరస్తా వద్ద వాహనాన్ని తనిఖీలు చేస్తున్న సీఐ జలేంధర్‌రెడ్డి

### డెలివరీ బాయ్‌పై దాడి: వ్యక్తిపై కేసు నమోదు

కాచిగూడ: మద్యం మత్తులో డెలివరీ బాయ్‌పై ఓ వ్యక్తి దాడి చేశాడు. కాచిగూడ ఎస్ఐ డి.సుభాష్ సమాచారం మేరకు... అంబర్‌పేట ప్రాంతానికి చెందిన అహ్మద్ కుమారుడు షేక్ యూనిస్ (25) ప్రైవేట్ డెలివరీ బాయ్. రత్నానగర్ సమీపంలో షేక్ యూనిస్ ఫోన్ మాట్లాడుతుండగా అదే సమయంలో నాగోల్ జైపూర్ కాలనీకి చెందిన పర్తిగారి గోపాల్ (30) పీకల వరకు మద్యం సేవించి కంకరయాఈతో షేక్ యూనిస్ తలపై కొట్టాడు. దీంతో షేక్ యూనిస్ తలకు తీవ్రంగా గాయమైంది. బాధితుడు ఫిర్యాదు మేరకు గురువారం గోపాల్‌పై కేసు నమోదు చేసి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

### కాంగ్రెస్‌తోనే మైనార్టీల సంక్షేమం

● పారిజాత నర్సింహా రెడ్డి



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న పారిజాత నర్సింహా రెడ్డి

పహాడీషరీఫ్: మైనార్టీల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని పీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహా రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన గ్యారంటీ పథకాలు, బీఆర్ఎస్ వ్యతిరేకతతో ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లోకి చేరుతున్నారని బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహా రెడ్డి తెలిపారు. జల్‌పల్లి మున్సిపాలిటీ 3వ వార్డు డ్రీమ్ సిటీలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముస్లింల ప్రగతి కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ జిల్లా నాయకులు రియాజ్ ఖాన్, బీఎంసీ మైనార్టీ చైర్మన్ సయ్యద్ అఫ్జల్ అహ్మద్, ఉపాధ్యక్షుడు మహ్మద్, అబ్దుల్ బారీ, బాబా తదితరులు పాల్గొన్నారు.

### 36 మంది బైండోవర్

● వైన్‌షాపులపై నిఘా

● మలక్‌పేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్



చాదర్‌ఘాట్: ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు మద్యం అక్రమ విక్రయాలపై 9 కేసులు నమోదు చేశామని మలక్‌పేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె.గోపాల్ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ మాట్లాడారు. కల్తీ కల్లు, నాటుసారా, బయట రాష్ట్రాల మద్యం, గంజాయి, డిఫెన్స్ లిక్కర్ అమ్మినా, కలిగి ఉన్నా, రవాణా చేసినా ఎన్నికల నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటి వరకు వివిధ కేసుల్లో అనేకసార్లు జైలుకెళ్లిన 36 మందిని బైండోవర్ చేశామన్నారు. మలక్‌పేటలో 11 బార్‌లు, 13 వైన్ షాపులు ఉన్నాయని వాటిపై కూడా నిఘా ఏర్పాటు చేశామన్నారు. రోజువారీ అమ్మకాల కంటే ఎక్కువ జరిగితే రికార్డులు చూపించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు అనీఫ్, శివచరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

# సందడిగా బతుకమ్మ సంబురాలు

మలక్‌పేట /ఎల్బీనగర్ జోన్ల బృందం: బతుకమ్మ ఉత్సవాలు మలక్‌పేట/ఎల్బీనగర్ నియోజకవర్గాల పరిధిలో వైభవంగా జరుపుకుంటున్నారు. కాలనీలు, అపార్ట్‌మెంట్లు, ఆలయాలు, విద్యా సంస్థల్లో వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా రూపొందించి వేడుకలు నిర్వహిస్తున్నారు. గురువారం పలుచోట్ల మహిళలు, యువతులు, విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ కోలాటం, దాండియా ఆడుతూ సందడి చేశారు.



మూసారంబాగ్ అవంతి డిగ్రీ, పీజీ కాలేజీలో..



అనిబీసెంట్ ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో..



చంపాపేట డివిజన్ రాజిరెడ్డినగర్‌లోని బాబా గుడిలో ..



దిల్‌సుఖ్‌నగర్ సిద్ధార్థ ఇంటర్, డిగ్రీ ఉమెన్స్ కాలేజీలో..



సాయిలాల్‌తోట చౌరస్తాలో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో....

## సురక్షిత పాలన అందిస్తున్నాం: మంత్రి సబితారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: రాష్ట్రంలో కేసీఆర్ నాయకత్వంలో సురక్షిత పాలన అందిస్తున్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. హరిపురి కాలనీ సంక్షేమ సంఘం భవనంలో గురువారం రాత్రి నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాలనీలో మౌలిక వసతులు కల్పించామన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, కాలనీలో అవకాశం ఉన్న చోట్ల రీడింగ్ రూమ్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. గత ఐదేళ్లుగా నియోజకవర్గంలోని చాలా సమస్యలు పరిష్కరించామన్నారు. రూ.4 కోట్లతో నియోజక వర్గంలో పెద్ద గ్రంథాలయం ఏర్పాటు చేశామన్నారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. మహేశ్వరం నియోజకవర్గానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను భారీ మెజారిటీతో గెలిపించి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ శ్రీధర్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మూరుకుంట్ల అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, డివిజన్ యూత్ వింగ్ మాజీ అధ్యక్షుడు శ్యామ్ గుప్తా, గొడుగు శ్రీనివాస్, అనురాధ శర్మ, వెంకటేశం గుప్తా హరి పురి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి, మహిళా మండలి అధ్యక్షురాలు సుకన్య పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

## ఆనంద్‌నగర్ చౌరస్తా వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి చర్యలు

మన్సూరాబాద్: నాగోలు–బండ్లగూడ రేడియల్ రోడ్డుపై ఆనంద్‌నగర్ చౌరస్తా వద్ద విపరీతమైన ట్రాఫిక్ జామ్ అవుతోందని, ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మాణానికి చర్యలు చేపడతానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి వెల్లడించారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హరిణ వనస్థలి జాతీయ పార్కు (డీర్‌పార్కు) మన్సూరాబాద్ గేట్ వద్ద గురువారం వాకర్స్‌ను కలిసి పార్కులోని సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వాకింగ్ ట్రాక్ నందు వేయించిన యోగా షెడ్ విస్తరణకు చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాకుండా ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ పార్కు స్థలాన్ని కొందరు తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి పేదలకు అమ్ముతున్నట్టు తన దృష్టికి వచ్చిందని, ఎవ్వరూ కొని మోసపోవద్దని సూచించారు. ఇంత పెద్ద పార్కును కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించి ఎల్‌బీనగర్ అభివృద్ధికి తోడ్పడాలని వాకర్స్‌కు సుధీర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, జగదీష్‌యాదవ్, విజయభాస్కర్ రెడ్డి, అశోక్‌యాదవ్, భాస్కర్‌యాదవ్, రాకేష్, వాకర్స్ విక్రమ్‌రెడ్డి, విద్యాసాగర్‌రావు, ఉపేందర్‌రావు, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**'ఎస్సీ మోర్చా' కన్వీనర్ బీఆర్‌ఎస్‌లో చేరిక**

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్‌కు చెందిన ఎస్సీ మోర్చా స్టేట్ స్లమ్ డెవలప్‌మెంట్ కన్వీనర్, బీజేపీ నాయకుడు హరిబాబు గురువారం మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరాడు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌లో చేరానని, వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు తనవంతు కృషి చేస్తానన్నారు. నాయకులు లింగాల రాహుల్‌గౌడ్, పవన్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, సన్నీయాదవ్, దుబ్బాక శేఖర్‌రెడ్డి, వీరన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



హరిబాబును పార్టీలో చేర్చుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

## ఇంద్రసేనారెడ్డి ఇంటి వద్ద బీజేపీ శ్రేణుల సందడి



బాణసంచా కాల్చుతున్న బీజేపీ నాయకులు



ఇంద్రసేనారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి



ఇంద్రాసేనారెడ్డికి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపిన చీకోటి ప్రవీణ్

మలక్‌పేట: సలీంనగర్‌లోని నల్లు ఇంద్రసేనారెడ్డి ఇంటి వద్దకు గురువారం బీజేపీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి రావడంతో సందడి నెలకొంది. త్రిపుర గవర్నర్‌గా నియమితులైన ఇంద్రసేనా రెడ్డి బంజారాహిల్స్ నుంచి మలక్‌పేటకు రావడంతో ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. బాణ సంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. రాష్ట్ర, నగర, నియోజకవర్గ నాయకులు ఆయన్ను కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, కోశాధికారి రమేష్‌రెడ్డి, మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్ రెడ్డి, సీనియర్ నేతలు బి. నర్సింహ, దేవేందర్, రాంకోటేశ్వర్‌రావు, సుభాష్‌చందర్‌జీ, సహదేవ్‌యాదవ్ తదితరులు ఇంద్రసేనారెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

**పలువురి అభినందనలు**

మన్సూరాబాద్ / నాగోలు/సైదాబాద్: త్రిపుర రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన నల్లు ఇంద్రసేనా రెడ్డిని చీకోటి ప్రవీణ్‌కుమార్ , మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, బీజేపీ రాష్ట్ర ఓబీసీ సెల్ కో కోశాధికారి గాజుల స్వయం ప్రకాష్‌లు గురువారం విడివిడిగా కలిసి శాలువాలతో సత్కరించి అభినందించారు. అలాగే, బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ ఇంద్రాసేనా రెడ్డిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.



ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న కొప్పుల నర్సింహారెడ్డి



ఇంద్రాసేనారెడ్డిని సన్మానిస్తున్న సామ రంగారెడ్డి, కార్పొరేటర్ పవన్‌కుమార్

## అధికారుల అలసత్వం...ప్రయాణికులకు ప్రాణ సంకటం



రోడ్డుపై బోల్తా పడ్డ ఇనుప చువ్వల లోడ్ వాహనం

హయత్‌నగర్: అధికారుల నిర్లక్ష్యం వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది... హయత్‌నగర్ నుంచి తొర్రూరు వైపు వెళ్లే పాత రోడ్డులో 40 రోజుల క్రితం రోడ్డు మధ్యలో కుంగిపోయి పెద్ద గొయ్యి ఏర్పడింది. మరమ్మతు చేసేందుకు అధికారులు నెల రోజులకు పైగా రోడ్డును మూసివేయడం ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డుకు పూర్తిగా మరమ్మతులు చేపట్టకుండానే వాహనాలను అనుమతించారు. రోడ్డును తవ్విన చోట మట్టి దిబ్బలు, గుంతలను పూడ్చి వేయకపోవడంతో రోడ్డంతా గుంతల మయంగా మారింది. రోడ్డు ఎగుడు దిగుడుగా మారడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు ఓ వైపునకు ఒరిగిపోయి కింద పడుతున్నాయి. ఈ ప్రాంతంలో రోజుకో ప్రమాదం జరగడం పరిపాటిగా మారింది. తాజాగా బుధవారం సాయంత్రం ఇనుప చువ్వల లోడ్‌తో వెళ్తున్న ఓ ఆటో బోల్తా పడింది. దగ్గరలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డుపై మట్టిని పోసి ఎగుడు దిగుడులను సరి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.